హడావుడిగా సీసీ రోడ్ల పనులు

- ఈనెల 31 వరకు పూర్తికి అధికారుల యత్నం
- 579 పనులకు.. రూ.34.40 కోట్లు
- ఇప్పటికే 449 రోడ్ల పనులు పూర్తి
- మరో 130 పనులు ప్రారంభమే కాలేదు
- నాణ్యతపై స్థానికుల్లో అనుమానం


ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

పెగడపల్లి: జిల్లాలోని పలు గ్రామాలకు ఉపాధిహామీ నుంచి నిధులు వస్తున్నాయి. ఆ నిధులను పూర్తిగా వినియోగించుకునేందుకు గ్రామస్థాయి నాయకులు హడావుడిగా పనులు చేపడుతున్నారు. దీంతో పర్యవేక్షణ కరువై నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు వేసేందుకు ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో ఈ నిధులు మంజూరయ్యాయి. అన్ని గ్రామాల్లో రోడ్ల పనులను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ఆ పార్టీ నాయకులే దక్కించుకున్నారు. అయితే ఈనెల 31నాటికి సీసీ రోడ్ల పనులన్నీ పూర్తి చేయాల్సి ఉండటం.. మూడు రోజుల గడువు మాత్రమే ఉండటంతో హడావుడిగా పనులు చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రతిపాదనలు ఇలా..

జిల్లాలోని అన్ని గ్రామాల్లో రూ.34.40 కోట్లతో 579 సీసీ రోడ్ల పనులకు అనుమతి వచ్చింది. ఈ పనులను ఈనెల 31 లోపు పూర్తి చేసి బిల్లులు సమర్పించాల్సి ఉంది. చేస్తున్న పనుల నాణ్యతపై ప్రజల నుంచి ప్రశ్నలు తలెత్తుతుండగా.. మరికొన్ని చోట్ల ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ కింద మంజూరైన ఈ పనులను గ్రామ పంచాయతీల ద్వారా తీర్మానం చేసి కేటాయించాలని కేంద్రం నిబంధన పెట్టింది. దీంతో చాలాచోట్ల అధికార పార్టీకి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులే పనులు చేపట్టారు. పనులు మాత్రం నామమాత్రంగా చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సిమెంట్ తక్కువ.. స్థానిక వాగుల్లో లభిస్తున్న ఇసుక, డస్ట్‌ను వాడుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు 449 పనులు పూర్తవ్వగా.. ఇంకా 130 పనులు ప్రారంభం కాలేదని అధికారులు చెబుతున్నారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

మంజూరైన 579 సీసీ రోడ్ల పనుల్లో ఇప్పటివరకు 449 పనులు పూర్తయ్యాయి. ఇంకా 130 పనులు మొదలు పెట్టలేదని అధికారులు చెబుతున్నారు. ఈనెల చివరి నాటికి పూర్తి చేయాల్సి ఉండటంతో అధికారులు కూడా హడావుడిగా పనులు ప్రారంభిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకుంటే నాణ్యత దెబ్బతినే అవకాశముందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిధులు వెనక్కి వెళ్లకుండా పనులు తొందరగా చేపడుతున్నా.. నాణ్యతలో రాజీ పడకూడదని ప్రజలు సూచిస్తున్నారు.

పనులపై నిరంతర పర్యవేక్షణ



గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు జరిపిస్తున్నాం. పనులపై నిరంతరం పర్యవేక్షిస్తూ నాణ్యత పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యత పరిశీలించిన తరువాతనే ఎంబీ రికార్డు చేసి బిల్లు మంజూరుకు నివేదిస్తున్నాం. అధికారుల అనుమతితో వివిధ ప్రాంతాల నుంచి ఇసుక తెప్పించుకోవచ్చు.

– రహమాన్, పీఆర్ ఈఈ

క్లుప్తంగా

ప్రతీ పంచాయతీ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయాలి

కథలాపూర్: ప్రతీ గ్రామ పంచాయతీ వద్ద ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయాలని కథలాపూర్ ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం కథలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నల్లా నీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం చేయకుండా పంప్ ఆపరేటర్లను అప్రమత్తం చేయాలన్నారు. నీటి సమస్య తలెత్తితే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కార్యదర్శులకు సూచించారు.

ఉచిత పశు వైద్యశిబిరం


పశువులను పరీక్షిస్తున్న పశు వైద్యాధికారులు

మెట్‌పల్లిరూరల్: చౌలమద్ది గ్రామంలో గురువారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక పశు వైద్య కేంద్రం వద్ద పశువులకు టీకాలు వేయడంతోపాటు గర్భకోశ వ్యాధి చికిత్సలు, చూడి పరీక్షలు జరిపారు. పశువులు, కోళ్లకు సోకే వ్యాధుల నివారణ చర్యల గురించి వివరించారు. వ్యవసాయంలో పాడి పంటల ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించారు. ఇఫ్కో జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, మండల పశు వైద్యాధికారిణి మనీషా, వైద్యుడు రవీందర్, సిబ్బంది మురళి, రమ, చిరంజన్, దిలీప్, మోహన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మున్నూరుకాపు వసతి గృహంలో తల్లి లేదా సంరక్షకులు కోల్పోయిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఆర్థిక సాయం అందించేందుకు ట్రస్ట్ బోర్డు నిర్ణయించిందని వసతి గృహం ట్రస్టీ పిల్లి శ్రీనివాస్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు రాజశేఖర్ తెలిపారు. ఏప్రిల్ 7 చివరి తేదీ అని, అర్హులైన విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో హైదరాబాద్‌లోని కాచిగూడ కార్యాలయంలో అందించాలన్నారు. మరణ ధ్రువీకరణ, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలుండాలని, బ్యాంక్ ఖాతా బుక్ జత చేయాలని సూచించారు. మిగతా వివరాలకు 040–24658160ను సంప్రదించాలని కోరారు.

స్పాట్ డ్యూటీ నుంచి మినహాయించండి


డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాల: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, రంజాన్ ఉపవాస ఉపాధ్యాయులకు స్పాట్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈవోకు వినతి పత్రం అందజేశారు. పదోతరగతి స్పాట్ విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణి, 58 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గత సంవత్సరం స్పాట్ డబ్బులు సైతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుకోవెల శ్యామ్‌సుందర్, కార్యదర్శి పీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టాలి

జగిత్యాల: ధర్మసముద్రం వద్ద మోటారుకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. గురువారం ధర్మసముద్రం వద్ద గల పంప్‌హౌస్‌ను పరిశీలించారు. వేసవిలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ధర్మసముద్రంలో కట్ట ఎత్తు పెంచి ఇసుక బస్తాలతో మరమ్మతు చేశామన్నారు. రా వాటర్‌కు చెందిన మోటార్ చెడిపోయిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించామని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడిగా వెంకటేశ్



కోరుట్ల: బీసీ సంక్షేమ సంఘం కోరుట్ల డివిజన్ అధ్యక్షుడిగా బింగి వెంకటేశ్‌ను నియమిస్తూ గురువారం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు నియామక పత్రాలు అందించారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘాల నాయకులకు వెంకటేశ్ ధన్యవాదాలు తెలిపారు.

పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం


స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్న చైర్మన్

ధర్మపురి: ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో గురువారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. సంఘం లావాదేవీలు, గోదాముల నిర్మాణాల విషయంపై చర్చించారు. ముఖ్యంగా రైతుల శ్రేయస్సు కోసం కమలాపూర్ గ్రామంలో డీసీఎమ్మెస్ చైర్మన్‌కు చెందిన ఒక గుంట స్థలం పీఏసీఎస్ పేరు మీద రిజిస్టర్ చేయించి సంఘ సభ్యుల సమక్షంలో పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శేర్ల రాజేశం, కార్యవర్గ సభ్యులు ఎల్లాగౌడ్, లింగన్న, రవి తదితరులున్నారు.

రైతుల సంక్షేమం కోసమే సహకార సంఘాలు


రాయికల్‌లో ఆర్థిక సాయం అందిస్తున్న ఏనుగు మల్లారెడ్డి

రాయికల్: రైతుల సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని భూపతిపూర్ సింగిల్‌విండో చైర్మన్ ముత్యంరెడ్డి, రాయికల్ సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి అన్నారు. గురువారం ఆయా సహకార సంఘాల పరిధిలో వార్షిక నివేదికలపై సమావేశం నిర్వహించారు. రైతుల సంక్షేమం కోసం రుణాలు, కాంప్లెక్స్ ఎరువులు, యూరియా అమ్మకాలు చేపట్టామని తెలిపారు. రాయికల్‌లో మృతిచెందిన రైతు కుటుంబాలకు సహకార సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. సీఈవో రవి పాల్గొన్నారు.




అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శేషప్ప కళావేదికపై ధర్మపురికి చెందిన గుండి ప్రేమ్‌కుమార్, పురుషోత్తం మిమిక్రీ ఆకట్టుకుంది. ఆనందవర్దన్ ఏకపాత్రాభినయం, కుమారి లాస్య, శ్రీకృతి కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను ఆలయం పక్షాన సన్మానించారు.

యువత అన్ని రంగాల్లో ఉండాలి


సర్టిఫికెట్లతో విద్యార్థులు

జగిత్యాల: ప్రస్తుత కాలంలో యువత అన్ని రంగాల్లో ఉండాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖలో నమోదైన పిల్లలకు ఉచితంగా కెరీర్ గైడెన్స్ ప్రిపరేషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. యువత నైపుణ్యం కనబర్చేందుకు తెలంగాణ భవన నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 41 రకాల కంప్యూటర్ కోర్సులను యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఏపీసీసీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ప్రకాశ్ మాట్లాడుతూ.. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 177 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రాజెక్ట్ లీడ్స్ దాసరి రాజేంద్ర, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ప్లేస్కూల్ వార్షికోత్సవం



కోరుట్ల: పట్టణంలోని ఎల్‌ఎఫ్‌ఎస్ ప్లేస్కూల్ వార్షిక వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ దిలీప్‌రావు హాజరయ్యారు. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. కరస్పాండెంట్ తుమ్మనపెల్లి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పెంచితేనే నిరీక్షణకు తెర

- కథలాపూర్ మండలంలో 41 కేంద్రాలు
- 36,975 మంది ఓటర్లు


చింతకుంటలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసేందుకు బారులు తీరిన మహిళలు(ఫైల్)

కథలాపూర్: గ్రామాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అవగాహన సదస్సులు, విస్తృతంగా ప్రచారం చేస్తున్నా.. అవసరమైన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పెంచడం లేదని ప్రజలంటున్నారు. పోలింగ్ రోజున కొన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షించి విసిగిపోయి ఓటేయకుండానే ఇంటిబాట పడుతున్నట్లు ఓటర్లు వాపోతున్నారు. అసలే ఎండాకాలంలో పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండటంతో.. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాలను పెంచాలని మండల ఓటర్లు కోరుతున్నారు.

19 గ్రామాలు..

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా... 36,975 మంది ఓటర్లున్నారు. ఎంపీ ఎన్నికల కోసం 41 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఓటేసేందుకు వెళ్లే ఓటర్లు ఇబ్బందులు పడకుండా ప్రతీ గ్రామంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సిరికొండ, తక్కళ్లపెల్లి, బొమ్మెన, భూషణరావుపేట, చింతకుంట, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, అంబారిపేట గ్రామాల్లో ఓటర్లు అధికంగా ఉన్నట్లు ఓటరు జాబితా ప్రకారం తెలిసింది. ఆయా గ్రామాల్లో మూడు, నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినా.. కొన్ని కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య వెయ్యికి పైగా ఉంది. పోలింగ్ రోజు ఓటేసేందుకు వచ్చిన ఓటర్లు గంటల తరబడి క్యూలో నిరీక్షించిన సంఘటనలు అసెంబ్లీ ఎన్నికల వేళ చోటుచేసుకున్నాయి.

కోరుతున్న గ్రామాలివే..

సిరికొండలో 51, 53 పోలింగ్ కేంద్రాల్లో ప్రతీ ఎన్నికల వేళ ఓటర్లు బారులు తీరి ఉంటున్నారు. తక్కళ్లపెల్లిలో 55 పోలింగ్ కేంద్రం, భూషణరావుపేటలో 69 పోలింగ్ కేంద్రంలో 1,100 మంది ఓటర్లుండటంతో.. నిరీక్షణ తప్పడం లేదు. చింతకుంటలో 70వ పోలింగ్ కేంద్రం, గంభీర్‌పూర్‌లో 77, 78 పోలింగ్ కేంద్రాలు, తాండ్ర్యాలలో 80వ పోలింగ్ కేంద్రం, అంబారిపేటలో 89వ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉందని ఆయా గ్రామాల నాయకులు తెలిపారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాల గ్రామాల్లో అదనంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తే ఓటర్లకు సౌకర్యవంతంగా ఉంటుందని నాయకులు అభిప్రాయపడుతున్నారు. లేకుంటే ఓటింగ్ శాతం తగ్గే అవకాశముంటుందని అంటున్నారు.

ఓటరు జాబితా ప్రకారం పెంచాలి



ఓటరు జాబితా ఎప్పటికప్పుడు పెరిగిపోతుంది. అందుకనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెంచాలి. భూషణరావుపేటలో 69 పోలింగ్ కేంద్రంలో ప్రతీ ఎన్నికలప్పుడు ఓటర్లు బారులు తీరి ఉంటారు. దీంతో గంటల తరబడి ఓటర్లు నిలబడి ఉండటానికి అవస్థలు పడుతున్నారు.

– ముస్కు శ్రీనివాస్, భూషణరావుపేట

వసతులు కల్పించాలి



ఎన్నికలప్పుడు పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి. ఓటర్ల సంఖ్యకనుగుణంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే పోలింగ్ శాతం పెరుగుతుంది. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకోగానే 15 నిమిషాల్లో ఓటేసి వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలి.

– కాశవత్తుల లక్ష్మిరాజం, చింతకుంట

1,300 ఓటర్లకు ఒకటి..



కథలాపూర్ మండలంలో 36,975 మంది ఓటర్లున్నారు. వీరికోసం 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం. 1,300 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ముంతాజిబొద్దీన్, తహసీల్దార్, కథలాపూర్

ఇస్రోకు ఎంపికైన ప్రజ్ఞ స్కూల్ ప్రాజెక్ట్


విద్యార్థులకు అభినందన

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ గ్రామంలోని ప్రజ్ఞ సీబీఎస్ఈ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కాలువ అనన్య, కూసరి మైత్ ఇస్రో నిర్వహిస్తున్న వైయూవీఐకేఏ యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం స్పేస్ క్విజ్ అండ్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో తమ ప్రతిభ కనబర్చి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనిల్ తెలిపారు. దేశవ్యాప్తంగా 350 మంది విద్యార్థుల్లో తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఎంపికయ్యారని, ఇందులో ప్రజ్ఞ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. అకాడమీ ఇన్‌చార్జి జంగిలి రాజశేఖర్, సైన్స్ ఉపాధ్యాయులు సాగర్, సంధ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కోరుట్ల: అయిలాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల పంచాయతీ అధికారి నీరజ గురువారం ప్రారంభించారు. పంచాయతీరాజ్ సీఎస్ ఆదేశాలతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, కాశేశ్వరి, మంజుల, విమల, సుమతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

రాయికల్: ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా కూరగాయల రవి, ప్రధాన కార్యదర్శిగా గరిపెల్లి శ్రీనివాస్, కోశాధికారిగా పల్లెర్ల పవన్, ఉపాధ్యక్షులుగా అయిత శేఖర్, సిర్ప సంతోష్, బొల్సాని అంజనేయులు, అయిత నవీన్, జాయింట్ సెక్రటరీలుగా సిద్దంశెట్టి మహేశ్, కూరగాయల అశోక్, జక్క రంజిత్, కట్కం కల్యాణ్, పీఆర్వోలుగా నాగమల్ల శ్రీకర్, నరంశెట్టి మనోజ్ ఎన్నికయ్యారు.

చెరువులను ఆక్రమిస్తే చర్యలు

మల్లాపూర్: చెరువుల ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్(డీఈ) దేవానంద్ అన్నారు. మండలంలోని వీవీరావుపేట చెరువు కబ్జాకు గురవుతోందన్న ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువును పరిశీలించారు. శిఖం భూములను కబ్జా చేసినా.. నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఏఈ రాకేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ ఫీషర్మెన్ కమిటీ మండల అధ్యక్షుడు రొద్ద రాజు, స్థానిక మత్స్య సహకార సంఘం సభ్యులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

పిల్లలపై దృష్టి సారించాలి

జగిత్యాల: జిల్లాలో గంజాయి వాడకం పెరుగుతున్న దృష్ట్యా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు అన్నారు. ఆస్పత్రిలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జగిత్యాలలోని మాతాశిశు సంక్షేమ కేంద్రంలో డీ–అడిక్షన్ సెంటర్ ఉందని, అనుమానం ఉంటే తీసుకురావాలని, సైకియాట్రిస్ట్, ప్రొఫెసర్లు ఉంటారని, వారు చికిత్స అందిస్తారని తెలిపారు. త్వరలోనే కళాశాలలు, స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ కౌన్సిలర్


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న నర్సింగరావు

కోరుట్ల: పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత, ఆమె భర్త రాజశేఖర్ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు గురువారం కౌన్సిలర్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దాసరి సునీత ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్‌గౌడ్, కొంతం రాజం, సీనియర్ నాయకులు బోయినిపెల్లి సత్యంరావు, శీలం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్కూటీ దగ్ధం



జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వాణీనగర్‌కు చెందిన నాగమల్ల శ్రీనివాస్ స్కూటీ గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. గురువారం శ్రీనివాస్ తన స్కూటీని రిపేరు కోసం మెకానిక్ షాపుకు తీసుకెళ్లి బయట పార్కింగ్ చేసి ఉంచాడు. ఇంతలోనే స్కూటీ నుంచి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో ఆందోళనకు గురైన స్థానికులు పక్కనే నీరు ప్రవహిస్తున్న డ్రెయినేజీలో స్కూటీని పడేసి మంటలార్పారు.

నిజామాబాద్ ఎంపీ స్థానం గెలవాలి

సారంగాపూర్: నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కలిసి పని చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం అర్పపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ఎండబెట్ల గాబ్రియల్, కొండ మురళి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరగా.. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఎమ్మెల్సీ ఆహ్వానించారు. తనను గుర్తించి తనకు నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బ్లాక్ అధ్యక్షుడు నందయ్య, మాజీ వైస్ ఎంపీపీ బేతి పూర్ణచందర్‌రెడ్డి, అప్పం స్వామి, బాదినేని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: నిజామాబాద్ ఎంపీ టికెట్ ఖరారైన నేపథ్యంలో గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయంతోపాటు ధరూర్ క్యాంపు కోదండ రామాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, కల్లెపెల్లి దుర్గయ్య, ఆకుబత్తిని శ్రీనివాస్, తాటిపాముల వినోద్, ఆకుల నాగరాజు తదితరులున్నారు.

జగిత్యాలటౌన్: జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అభినందించారు. న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ సామాజిక వర్గాన్ని బలోపేతం చేయాలి

ధర్మపురి: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం ఎస్సీ సామాజికవర్గాన్ని బలోపేతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మోర్చా ఎన్నికల సహాయ ఇన్‌చార్జిగా నియమితులైన దొనకొండ నరేశ్‌ను పట్టణంలో శాలువాతో సన్మానించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించి దళితులను ఏకతాటిపైకి తేవాలన్నారు. మోర్చా పట్టణ అధ్యక్షుడు లవన్‌కుమార్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కో–కన్వీనర్ బండారి లక్ష్మణ్ బీజేవైఎం పట్టణశాఖ అధ్యక్షుడు భాస్కర్ తదితరులున్నారు.